క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ శ్రీనివాసరావు

గడివేముల: ఎంపీడీఓగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శివమల్లేశ్వరప్పను వెల్దుర్తికి, వెల్దుర్తి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును గడివేములకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. నూతన ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోడుమూరు: హంద్రీనది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను మండలంలోని పులకుర్తి గ్రామం వద్ద సోమవారం సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు, ఇసుక తరలిస్తున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు

గడివేముల: స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రిన్సిపాల్ శైలజ సోమవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ డౌన్‌లోడు చేసుకుని పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నీలి షికారీలు

ఓర్వకల్లు: స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓ



ఎమ్మెల్యే సుధాకర్‌ను సత్కరిస్తున్న కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అజాంఖాన్ కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌ను ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎన్ భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

సి.బెళగల్: స్పందనకు వచ్చిన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

● గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాయలంలో తహసీల్దార్ ఆజంనేయులు స్పందన కార్యక్రమంలో నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ మాధవీలత, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఎంఈఓ సునీలమ్మ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మించాలి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు వద్ద జాతీయ రహదారిపై ఫుట్ వే వంతెనకు బదులుగా ఫ్లై ఓవర్ నిర్మించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం వారు గ్రామస్తులతో కలిసి కర్నూలులో జరిగిన స్పందనలో జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ రహదారి దాటేందుకు ప్రయాణికులతో పాటు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జేసీని కలిసిన వారిలో షంషుద్దీన్, గౌండ రాముడు, విజయుడు, సీఐటీయూ నాయకులు శ్రీధర్, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

పాలన..ప్రజల మన్నన

● గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నాంది
● గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా పాలన
● హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామీణ ప్రాంతాల ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చారు. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతన్నలకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తున్నారు. మన బడి నాడు నేడు కార్యక్రమంతో కార్పొరేట్ విద్యావ్యవస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారు. ఇక ప్రతి పేదవాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో పాటు ఇంటి వద్దకే ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా మారుమూల పల్లెలకు సైతం వైద్య సేవలను విస్తరించారు. ఇక కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తూ పేదల ప్రభుత్వంగా మన్ననలు పొందుతోంది.

– గడివేముల

అన్ని సేవలు సచివాలయాల్లోనే..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికై సచివాలయాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. వీటి ద్వారా 545 సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఏ చిన్న సమస్య అయినా గ్రామంలో పరిష్కారం చేసుకునేలా చర్యలు తీసుకుంటోంది. 14 గ్రామ సచివాలయాల నిర్మాణాల కోసం రూ.4.90 కోట్లు వెచ్చిస్తోంది.

అన్నదాతల కోసం ఆర్బీకేలు

అన్నదాతల కోసం ప్రభుత్వం రూ.305 లక్షల వ్యయంతో రైతుభరోసా కేంద్రాలను నిర్మిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా రైతన్నలకు అవసరమైన అన్ని సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. వీటి ద్వారా రైతులకు ఉపయోగపడే వ్యవసాయ సేవలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యసాయ పద్ధతులపై కాల్‌సెంటర్లతో సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు కృషి చేస్తున్నారు.

మెరుగైన వైద్యం కోసం ఆరోగ్య కేంద్రాలు..

గ్రామాల్లో ప్రజలకు మేరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం 14 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణానికి గాను రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. వీటిద్వారా ప్రజలకు ఆయా గ్రామాల్లోనే మంచి నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొరటమద్ది సచివాలయం

పొలాల రోడ్లు బాగు..

గతంలో రస్తాలు బాగోలేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. వర్షాకాలం వచ్చిందంటే మరీ కష్టంగా ఉండేది. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లాలంటే భయపడేవారు. పండించిన దిగుబడులను ఇంటికి తీసుకురావాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. ఒక్కోసారి ప్రమాదాలు జరిగి దిగుబడులకు తీవ్ర నష్టం జరిగేది. గడివేముల మండల కేంద్రం పరిధిలోని పల్లె పొలం, మూలమడ, తంగోడి రస్తా, పెద్ద మడ పొలాల రస్తాలతో పాటు వివిధ గ్రామాల పొలాల రోడ్లు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఇదే విషయాన్ని రైతులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్స్ నుంచి రూ.4.01 కోట్లు మంజూరు చేయించడంతో ప్రస్తుతం పొలాల రస్తాల బాగు కోసం అధికారులు శ్రీకారం చుట్టారు.



గడివేముల సమీపంలో పొలం రస్తాను బాగు చేసిన దృశ్యం

గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి



రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోనే సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, పాలశీతలీకరణ కేంద్రాలను నిర్మిస్తోంది. వీటి వల్ల గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి బాటలో తీసుకుపోయేందుకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– యాసిన్‌బాషా, గడివేముల

అన్ని సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం



కుల, ఆదాయ, పుట్టిన, మరణ, పొలాల ధ్రువపత్రాలకు గ్రామంలోనే పరిష్కారం లభిస్తుంది. గత ప్రభుత్వంలో రోజుల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవి కావు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం సచివాలయాలు ఏర్పాటు చేసి అన్ని సమస్యలను పరిష్కరిస్తుండటం సంతోషకరం.

– శ్రీకాంత్‌రెడ్డి, పెసరవాయి గ్రామం

భవన నిర్మాణాలను పూర్తిచేస్తాం

గడివేముల మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న సచివాలయ, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, పాలశీతలీకరణ కేంద్రాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరిత గతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయా గ్రామాల్లో కొన్ని భవనాలు పూర్తి కాగా కొన్ని మాత్రం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు సేవలు అందేలా చూస్తాం.

– భాస్కర్, పీఆర్ ఏఈ, గడివేముల

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో మంగళవారం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు. మొదటి రోజున పెండేకంటి నగర్, బస్టాండ్ ప్రాంతం, షికారీ పేటలో కార్యక్రమం కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు సోమవారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు వారు తెలిపారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

గృహనిర్మాణ లబ్ధిదారులకు రుణ సాయం



రుణం అందజేస్తున్న అధికారులు

సి.బెళగల్: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో కంబదహాల్ గ్రామానికి చెందిన ఐదు గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.1,75,000 బ్యాంక్ రుణాన్ని మండల హౌసింగ్ ఏఈ సుమంత్, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీలలో లబ్ధిదారుల గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

● ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: సీఎం వైఎస్ జగనమోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామానికీ చేరుతుండటంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హంద్రీనదిలో పైపులు తరచూ పగిలిపోతుండడంతో తాగు నీటి సమస్య తలెత్తుతోందని, జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తే పాత ఇంటి స్థానంలో కొత్త ఇళ్లు నిర్మించుకుంటామని, ఇంటి పట్టాలు, పింఛన్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గృహాలు, పింఛన్లు, ఇంటి పట్టాల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ ప్రసాద్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బాలక్రిష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏపీఓ రమాదేవి, ఏఈ గంగరాజు, ఏపీఎం పుష్పావతి, స్థానిక వైసీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బాలు, నాయుడు, మనోహర్, గోపాల్, మద్దయ్య, లాయర్ ప్రభాకర్, బలరాం, మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి పరిశీలన

గోరంట్ల గ్రామ సమీపంలో హంద్రీనదిపై రూ.24 కోట్లతో నిర్మిస్తున్న గోరంట్ల–కొత్తపల్లె బ్రిడ్జి నిర్మాణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సోమవారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణంపై అక్కడి ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా గోరంట్ల–కొత్తపల్లె బ్రిడ్జి మంజూరైందని, బ్రిడ్జి నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో కోడుమూరు, కృష్ణగిరి మండలాల నదీతీర ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరుతుందన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

గూడూరు రూరల్: కొలతల ప్రకారం పనులు చేస్తేనే కూలీలకు పూర్తి వేతనం రూ.272 అందుతుందని ఏపీఓ రామేశ్వరమ్మ అన్నారు. గుడిపాడు సమీపంలో చేపట్టిన ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజుకు 3,500 మందికి పైగా కూలీలు పనులకు హాజరవుతున్నారన్నారు.

సివిల్ సప్లయ్ గోదాము తనిఖీ

గూడూరు: పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదామును సోమవారం తహసీల్దార్ ఆంజనేయులు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, స్టాక్ రిజిష్టర్‌ను గోదాము ఇన్‌చార్జ్ రవీంద్రరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

సచివాలయం తనిఖీ

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ మాధవీలత తనిఖీ చేశారు. సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం స్పందన కార్యక్రమం నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

రైతు ఆత్మహత్య



తిప్పన్న (ఫైల్)

కోడుమూరు: మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన రైతు తిప్పన్న (45) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తిప్పన్న వ్యవసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం రూ.8 లక్షల దాకా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక ఆదివా రం సాయంత్రం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

● గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 35వ వార్డులో స్థానిక కార్పొరేటర్ మాధురి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు వీరయ్య, శ్రీనివాసులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సుభాన్, కేశవ్ స్వాగతం పలికారు. తర్వాత ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలతో వారికి కలిగిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. అలాగే కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు చెప్పాలన్నారు. డ్రైనేజీలు, కల్వర్టులు, రోడ్లు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరగా వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్, ఆనంద్, వలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూ పట్టాలు ఇవ్వాలి

కల్లూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ మండల కార్యదర్శి కె.మధు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ఉలిందకొండ, కొల్లంపల్లితండా, బొల్లవరం, బస్తిపాడు, దూపాడు తదితర గ్రామాల్లో బీడుగా ఉన్న ప్రభుత్వ భూములను పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే, ఆ భూములపై వారికి ఎటువంటి ఆధారాలు లేనందున ప్రభుత్వం అమలు చేసే పథకాలు అందడం లేదన్నారు. స్పందించి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పూలరంగడు, మారెన్న, స్వాములు, రాముడు, గోపాల్ నాయక్, హరిబాబు, లక్ష్మీదేవి, పద్మావతి, చంద్రమ్మ, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి, సుజిత్‌రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని కొండజూటూరు–పోలూరు గ్రామాల బీటీ రోడ్డు పనులను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డిలు సోమవారం అధికారులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో మైనింగ్ నిధులు రూ.1.14 కోట్లు మంజూరయ్యాయన్నారు. రెండు రోజుల్లో బీటీ రోడ్డు పనులు పూర్తి చేసి, ప్రజల ప్రయాణ కష్టాలు తీరుస్తామన్నారు. కాగా పనుల ప్రారంభ కార్యక్రమానికి ప్రజలు అధికంగా తరలివచ్చారు. నంద్యాలకు వెళ్లాలన్నా, కొండజూటూరుకు రావాలన్నా 3 కిలోమీటర్ల దూరం ప్రయాణం ప్రాణం మీదకు వచ్చేదని, ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మోక్షం లభించడం సంతోసకరమని ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ఇంజినీర్లు మహబూబ్‌బాషా, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, ఈశ్వరయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ఎల్లప్ప, కంది ప్రసాద్, శ్రీనివాసులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి






మొక్క నాటి నీరు పోస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

గూడూరు: ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాని పోషణ చూడాల్సిన బాధ్యత ఉందని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నగర పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మాధవీలత, ఎంఈఓ సునీలమ్మ, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు.

– సి.బెళగల్: స్థానిక గ్రామ సచివాలయం – 2లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండు రంగన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు, ఇంజినీర్లు , మొక్క నాటి నీళ్లు పోస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

కల్లూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉలిందకొండ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఉలిందకొండ రమణారెడ్డి, ఎ.వి. రమణ, శ్రీనివాసులు, శీనయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

● ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవి ప్రకాశ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

● పాణ్యం: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాణ్యం ఎస్సార్బీసీ కాలనీలోని అటవీశాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మొక్కలను, చెట్లను నరికివేస్తే సకాలంలో వర్షాలు పడవన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రఘురాముడు, జమాల్‌వలి, సిబ్బంది, జలవనరులశాఖ అధికారులు డీఈఈ వెంకటేశ్వర రెడ్డి, గంగధార్‌రెడ్డి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సచివాలయం ప్రాంగణం , పొలం గట్ల వెంట, చిత్రాల గుహ వద్ద సుమారు 500 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ అంజి, షార్డ్స్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ చిన్న హనుమన్న, హరికృష్ణ, శివమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంచుదాం

కల్లూరు: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంచుదామని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఓ) నాగరాజు నాయుడు అన్నారు. సోమవారం రిలయన్స్ స్వచ్ఛంద సంస్థ, అపార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఉలిందకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీడీ సలీం బాషా, సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఎంపీటీసీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

● పాణ్యం: ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటాలని ఆర్‌జీఎం ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవానికి ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు హాజరయ్యారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను ఆయన వివరించారు. తర్వాత కళాశాలలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ ఆశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తర్వాత వారు మొక్కలు నాటించారు.

● శాంతిరాం ఫార్మసీలో ప్రిన్సిపాల్ మధుసూధనొట్టి మొక్కలు నాటి పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు.